క్లుప్తంగా

పండుగల విశిష్టతను భావి తరాలకు అందించాలి



విజయవాడ కల్చరల్: తెలుగు పండుగల విశిష్టతను భావి తరాలకు అందించాలని నవోదయ స్కూల్ మాచవరం బ్రాంచ్ ప్రిన్సిపాల్ శ్రీధర రెడ్డి అన్నారు. పాఠశాలలో సోమవారం ఉగాది, రంజాన్ పండుగల విశిష్టతను తెలియజేయడానికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరంలో తొలిసారిగా జరుపుకొనే పండుగ ఉగాది అని, సర్వమానవ సౌభాతృత్వాన్ని చాటేది రంజాన్ అని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ వస్త్రధారణ, పండుగ విశిష్టతను తెలియజేసే బుర్రకథ, తెలుగు శతక ధారణ, వంద శతక పద్యాలతో అవధానం నిర్వహించారు. విద్యార్థులతోపాటు అధ్యాపకులు, సిబ్బంది, బాల బాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమాలను పాఠశాల నిర్వాహకురాలు లలితారెడ్డి పర్యవేక్షించారు.

ఐఎన్‌టీఎస్‌ఓ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): అంతర్జాతీయ ప్రతిభాన్వేషణ ఒలింపియాడ్ పరీక్ష (ఐఎన్‌టీఎస్‌ఓ) ఫలితాల్లో పటమటలంకలోని శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి తెలిపారు. తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు, వివిధ కేటగిరీల్లో బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మితో పాటు ఆ విద్యాసంస్థల ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ పద్మ, డీన్ దుర్గసాయి, ప్రైమరీ ఇన్‌చార్జి ఇందిరా, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా సెయింట్ జాన్స్ స్కూల్ వార్షికోత్సవం



సత్యనారాయణపురం(విజయవాడ సెంట్రల్): సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సత్యనారాయణపురం శాఖ 39వ వార్షికోత్సవాన్ని సోమవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి సిద్ధార్థ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ మన్నం రాజారావు వివిధ విభాగాల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ టి.మోనికసుమన్, కార్యదర్శి సుమన్‌త్యాగరాజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

5 శాతం రాయితీతో పన్ను చెల్లించవచ్చు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల చెల్లింపులపై 5 శాతం రాయితీతో ఈ నెలాఖరులోపు చెల్లించవచ్చని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై ప్రభుత్వం ఇచ్చిన 5 శాతం రాయితీ గడువు ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమేనని పేర్కొన్నారు. నగరంలోని పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరంలోని అన్ని క్యాష్ కౌంటర్లు ఈ నెలాఖరు వరకు పని దినాలు, సెలవు దినాల్లోకూడా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు పని చేస్తాయని తెలియ చేశారు. పన్నులు సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేయటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సిద్ధిక్‌నగర్ 3వ లైన్‌లో కోమటిపల్లి మీనాక్షి భర్త శ్రీనివాసరావుతో ఉంటుంది. వీరికి వివాహమై 8 సంవత్సరాలు అయ్యింది. పిల్లలు లేరు. కాగా భర్త పెయింటర్‌గా పని చేస్తుండగా భార్య ఆటోనగర్‌లో ప్రైవేట్ కంపెనీలో పని చేస్తోంది. కాగా ఆదివారం భార్యాభర్తలు కలిసి భోజనం చేసిన తరువాత భార్య మీనాక్షి నిద్రపోయింది. ఆమె నిద్రలేచిన తరువాత చూడగా భర్త ఇంట్లో కనిపించలేదు. అతని కోసం బంధువుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేదు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు పంచాంగ శ్రవణం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సిద్ధార్థ ఆడిటోరియంలో తమ కళాపీఠం ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర సందర్భంగా పంచాంగ శ్రవణం మంగళవారం నిర్వహిస్తున్నామని ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మశ్రీ కప్పగంతు సుబ్బరామ సోమయాజీ హాజరై పంచాంగ శ్రవణం చేస్తారని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు హాజరుకావాలని కోరారు.

కండ్రికకు మార్గం సుగమం

- అందుబాటులోకి వచ్చిన తారు రోడ్డు
- రూ. 3.40 కోట్లతో నిర్మాణం



కండ్రిక రోడ్డు

పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కండ్రిక నుంచి విజయవాడ నగరానికి వెళ్లేందుకు వీలుగా తారు రోడ్డు ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. గతంలో రోడ్డుగా చెప్పుకునేందుకు మాత్రమే ఈ రోడ్డు తుప్పలు, పెద్ద పెద్ద గుంతలతో ఉండేది. వర్షం వస్తే రాకపోకలకు ఎంతో కష్టంగా ఉండేది. గతంలో ఆ రోడ్డులో ప్రయాణం చేయాలంటే ప్రయాణీకులు భయపడే పరిస్థితి ఉండేది. సింగిల్ రోడ్డు.. ఆ రోడ్డులో క్వారీ లారీలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించేవి. లారీలు వస్తున్నాయంటే ఎదురుగా తప్పుకునే వీలులేక అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఆ విధంగా జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విలేజి కండ్రిక ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. పాల కేంద్రం నుంచి మూడు కిలోమీటర్ల పొడవునా 14 అడుగులు ఉండే రోడ్డును 21 అడుగులకు పెంచి బీటీ రోడ్డును నిర్మించడం జరిగింది. లారీలు ఎదురెదురుగా వస్తున్నా ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా రాకపోకలు జరిగే విధంగా రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఈ ప్రాంతంలోని భూములకు కూడా ధరలు పెరిగేందుకు దోహదపడుతుంది.

డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ గ్రాంటుతో నిర్మాణం..

డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ గ్రాంటు రూ. 3.40 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్ర రెవిన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఏపీ ప్లానింగ్‌బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. నిర్మాణం పనులు శరవేగంగా పూర్తి చేసుకోవడంతో ప్రజలకు రోడ్డు అందుబాటులోకి వచ్చింది.

ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా రోడ్డు



రోడ్డు నిర్మించడంతో 64వ డివిజన్‌లోని విలేజి కండ్రిక ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంది. విజయవాడ నగరానికి చేరువలో ఉన్న ఈ ప్రాంతం రోడ్డు నిర్మాణంతో మరింత వేగంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడింది.

–యరగొర్ల శ్రీరాములు, స్థానికుడు

పరిశ్రమల వారికి అనుకూల వాతావరణం



విజయవాడ నగరానికి ఆనుకొని ఉన్న విలేజి కండ్రికకు ఈ రోడ్డు నిర్మాణం వల్ల మంచి రహదారి మార్గం ఏర్పడింది. గతంలో ఈ రోడ్డు అనేక తుప్పలతో నిండి ఉండేది. నూతన రోడ్డు నిర్మాణంతో చిన్న చిన్న పరిశ్రమలు స్థాపించేవారికి కూడా అనుకూల వాతావరణం ఏర్పడింది.

– మేడా రమేష్, స్థానికుడు

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

పోలీస్ కమిషనర్ టీకే రాణా



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ టి.కె.రాణా

విజయవాడస్పోర్ట్స్: ఇఫ్తార్ విందు మత సమరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా అన్నారు. జిల్లా పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఎ కన్వెన్షన్ హాల్లో ఇఫ్తార్ విందు సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ రాణా మాట్లాడుతూ సర్వమతాలను గౌరవించడం మన దేశ సంప్రదాయమని తెలిపారు. అన్ని మతాలను సమానంగా ఆదరిస్తున్న మన దేశం ప్రపంచ వ్యాప్తంగా కీర్తి సాధించిందని పేర్కొన్నారు. ఆధ్యాత్మికతను సంతరించుకున్న రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని చెప్పారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఇఫ్తార్ విందును అందిస్తున్నామన్నారు. డీసీపీలు అధిరాజ్ సింగ్ రాణా, కె.శ్రీనివాసరావు, టి.హరికృష్ణ, కె.చక్రవర్తి, ఉదయరాణి, రామకృష్ణ, ఏడీసీపీలు కనక రాజు, కృష్ణమూర్తినాయుడు, డి.ప్రసాద్, శ్రీహరి బాబు, కె.ఆర్.ప్రసాద్, శశికాంత్ పాల్గొన్నారు.

నరసం కవితల పోటీ విజేతలు

విజయవాడ కల్చరల్: నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం (నరసం) జాతీయస్థాయిలో ఓటరు చైతన్యం అంశంగా నిర్వహించిన కవితల పోటీ విజేతల వివరాలను సంస్థ గౌరవ అధ్యక్షురాలు తేళ్ల అరుణ, అధ్యక్షురాలు చిన్నలక్ష్మి కళావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతిని హైదరాబాద్‌కు చెందిన వంజారి రోహిణి రాసిన కవిత మరువ బోకు, ద్వితీయ బహుమతి పశ్చిమ గోదావరి పాలకొల్లుకు చెందిన వై.శ్రీదేవి రచించిన ఓటరు గెలుపు, తృతీయ బహుమతి నిజామాబాద్‌కు చెందిన ఇక్కడ ఓట్లు అమ్ముడుబోవు, ప్రోత్సాహ బహుమతులు వైకే సంధ్యాశర్మ చిత్తూరు, కె.కవిత కర్నూలు గెలుచుకున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతులను వ్యక్తిగతంగా అందజేస్తామన్నారు.

అధికారికంగానే పూలే జయంతి నిర్వహించాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గత 15 ఏళ్లుగా ప్రభుత్వమే జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహిస్తుందని, ఈ ఏడాది కూడా అధికారికంగా నిర్వహించాలని బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్వీ. రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 11వ తేదీన జ్యోతిరావు పూలే జయంతి కాగా ఇంత వరకు అధికారులకు ఎటువంటి ఆదేశాలు జారీ కాలేదన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆదేశాలు జారీ కాకపోవడం బాధకరమన్నారు. బడుగు, బలహీన వర్గాలకు పూలే ఆదర్శప్రాయుడని తెలిపారు.

త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్ల దివ్య ఆశీసులతో త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్ –(త్రైతశకం-46) జిల్లా కలెక్టరు యస్.ఢిల్లీరావు ఆవిష్కరించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ప్రతినిధులు భగవద్గీత, హిందూ సంప్రదాయాల గ్రంథాలు కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఈ గ్రంథాలు ఎంతో గొప్పవని, దైవ జ్ఞానం ఉన్నవని పేర్కొన్నారు. ఈ గ్రంథాలు చదవడం ద్వారా మానవుడు కర్మ నుంచి బయట పడవచ్చన్నారు. అనంతరం త్రైత శకం తెలుగు క్యాలెండర్‌లను పలువురికి వితరణ చేశారు. సమితిసభ్యులు తిరుపతి మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులుస్వామి రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికీ సరళమైన భాషలో అర్థం అయ్యే విధంగా రూపొందించారని చెప్పారు. త్రైత సి ద్ధాంతం ప్రబోధ సమితి, హిందూ జ్ఞాన వేదిక, విజయవాడ కమిటీ అధ్యక్షుడు సభ్యులు జె.సురేష్,తిరుపతి, సత్యం, పైడిప్పడు, దుర్గారావు, శంకర్ పాల్గొన్నారు.

పాత ఇనుము వేలం ద్వారా రూ.17 వేల ఆదాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని శ్రీ రాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పాత ఇనుము 500 కేజీలకు బహిరంగ వేలం నిర్వహించగా రూ.17 వేల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. ఈఓ మాట్లాడుతూ.. సీజీఎఫ్ పనుల్లో భాగంగా ఆలయంలో ముఖ మండపం కొట్టి వేయగా సుమారు 500 కేజీల పాత ఇనుము వచ్చిందన్నారు. దేవదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో ఇనుమును వేలం నిర్వహించగా, న్యూ ఆటోనగర్‌కు చెందిన డి.మణిబాబు రూ.17 వేలకు ఇనుము దక్కించుకున్నారని చెప్పారు.

వెలంపల్లిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం



63వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న చక్రవర్తి

పాయకాపురం(విజయవాడరూరల్): సెంట్రల్ ని యోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని వెలంపల్లి అల్లుడు మంచుకొండ చక్రవర్తి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక 63వ డివిజన్ ఈడబ్ల్యూఎస్ కాలనీలో సోమవారం వెలంపల్లి విజయాన్ని కాంక్షిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. పేదల పక్షాన ఉంటూ వారిని అన్ని విధాలుగా ఆదుకొంటున్న సీఎం జగనన్నను ఆదరించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)ను ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి మేడా రమేష్, వైఎస్సార్ సీపీ డివిజన్ కోఆర్డినేటర్ పసుపులేటి యేసు, ఇన్‌చార్జి జలసూత్రం శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మోదుగుల గణేష్, సీహెచ్ రవి, టిక్యం కృష్ణ, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

కుజ, నాగ దోష నివారణకు రాహు, కేతు సర్పవ్రతం



శ్రీ రాహు, కేతు సర్పవ్రతం

మధురానగర్(విజయవాడ సెంట్రల్): కుజ, నాగ, కాల సర్ప దోష నివారణకు సోమవారం శ్రీ శివజ్ఞానపీఠం ఆధ్వర్యాన సత్యనారాయణపురం బాబూరావు మేడ సెంటర్‌లో రాహు, కేతు సర్ప వ్రతం జరిగింది. శ్రీ శివజ్ఞాన పీఠాధిపతి శ్రీ శివాచార్యస్వామి చేతులమీదుగా వ్రతం జరిపించారు. ఈ సందర్భంగా ఆయన రాహు, కేతు సర్ప వ్రతం విశిష్టతను వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వ్రతంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమాలను పీఠం ఆర్గనైజర్ పేర్ల శ్యాంప్రసాద్, పాలడుగు హైమావతి తదితరులు పర్యవేక్షించారు.

నేడు అమరావతి కన్వెన్షన్ హాల్లో ఉగాది వేడుకలు



ఉగాది వేడుకల వాల్ పోస్టర్ ఆవిష్కరించిన శాంతి ప్రియ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విముదా ఇన్ ఫ్రా ప్రాజెక్ట్స్, లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఫైన్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లయన్ డి దుర్గాప్రసాద్, డాక్టర్ రామ్ చంద్, లయన్ పి రమేష్, లయన్ అప్పారావు తెలిపారు. గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉగాదిని పురస్కరించుకుని విద్య, వైద్య, సామాజిక రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి ఉగాది పురస్కారాలు అందజేయనునట్లు తెలిపారు. బందరు రోడ్డులోని విజయ కృష్ణ సూపర్ మార్కెట్ వద్ద అమరావతి కన్వెన్షన్ లో జరిగే వేడుకలకు ముఖ్య అతిథిగా నూతన హీరోయిన్ శాంతి ప్రియ (దర్శిని మూవీ ఫేమ్) హాజరవుతారని తెలిపారు. వేడుకల సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. వేడుకల వాల్ పోస్టర్‌ను శాంతి ప్రియ విడుదల చేశారు.

అల్లా ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలి



ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాను గజమాలతో సత్కరిస్తున్న ముస్లిం సోదరులు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని అల్లా ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. స్థానిక ముత్యాలంపాడు జెండాచెట్టు సెంటర్‌లోని మసీదులో సోమవారం ఇఫ్తార్ విందు జరిగింది. కార్యక్రమంలో ఆయన పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అల్లా చూపిన మార్గంలో పయనించాలని తోటివారికి సాయం చేయడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ప్రతీ ఏటా కలిసి మెలిసి ఇఫ్తార్ విందు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. అనంతరం స్థానిక ముస్లిం పెద్దలు, నాయకులు ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాను గజమాలతో సత్కరించారు. ముస్లింల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న రుహుల్లాకు అల్లా ఆశీస్సులు తప్పక లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ కృష్ణాహోటల్ సెంటర్‌లోని మక్కా మసీదులో సోమవారం ఇఫ్తార్ విందు జరిగింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అల్లా ఆశీస్సులు ప్రతీఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, అఫ్రోజ్, రహీం, జలీల్, రెహమాన్, మహబూబ్‌వలి, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాగళ్ళ విద్యాకన్నా, సంస్థ ఉద్యోగులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వేసవి కాలం సందర్భంగా తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి మే 2 తేదీ వరకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ళ విద్యాకన్నా చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో స్వయం ఉపాధి కోర్సులకు సంబంధించి బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. విద్యాకన్నా మాట్లాడుతూ ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఫ్లవర్ మేకింగ్, మోహంది, హౌస్ డెకరేటివ్ ఆర్టికల్స్, వాషింగ్ మెషిన్ లిక్విడ్స్, డిటర్జంట్స్ మేకింగ్, ఇన్‌స్టంట్ ఫుడ్ ఐటమ్స్, చాక్లెట్స్ మేకింగ్, న్యాచురల్ హెయిర్ ఆయిల్ అండ్ షాంపు తయారు చేసే కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 14 తేదీలోగా తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ 0866–2470420 నెంబరులో కానీ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. సంస్థ ప్రోగ్రామ్ ఆఫీసర్‌తో పాటుగా ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ అండగా ఉంటా

వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



36వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గంలోని 36వ డివిజన్ గాంధీనగర్‌లో సోమవారం కార్పొరేటర్ బాలి గోవింద్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. 58 నెలల్లో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. తమ ఓటు ఫ్యాన్ గుర్తుకే వేస్తామని ప్రజలే చెబుతున్నారని అన్నారు. డివిజన్ అభివృద్ధి, సంక్షేమానికి మరింతగా పాటుపడతానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో 36వ డివిజన్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఒకటో డివిజన్‌లో..

గుణదల (విజయవాడ తూర్పు): సెంట్రల్ నియోజకవర్గంలోని ఒకటో డివిజన్ లెనిన్‌నగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ ఉద్దంటి సునీతాసురేష్‌తో కలిసి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ పర్యటించి జగనన్న హయాంలో చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న ఆదరణే మాకు అఖండ విజయం చేకూరుస్తుందన్నారు. గతంలో అభివృద్ధిని గాలికి వదిలేసిన బొండా ఉమా ఇప్పుడు ఓట్లు వేయ్యండి అభివృద్ధి చేస్తానని ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్వాడీ యూనివర్సిటీలో అత్యుత్తమ విద్య



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వర్సిటీ ప్రతినిధులు శ్రీధరన్, వెంకట వినయ్‌చౌదరి, మహేంద్రనాయుడు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశంలో ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటైన మార్వాడీ యూనివర్సిటీలో చదివిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని ఆ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ డీన్ డాక్టర్ ఆర్.శ్రీధరన్ అన్నారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఉన్న తమ యూనివర్సిటీలో అన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. లబ్బీపేటలో ఏర్పాటు చేసిన మార్వాడీ యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యాలయాన్ని సోమవారం డాక్టర్ ఆర్ శ్రీధరన్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు మంచి కోర్సులు అందించేందుకు ముందుకు వచ్చామని తెలిపారు. జాతీయ స్థాయిలో రాణించేందుకు యూనివర్సిటీలో బోధన, స్కిల్స్ దోహదం చేస్తాయని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల కంటే అతి తక్కువ ఫీజులని వెల్లడించా. తమ యూనివర్సిటీలో 54 దేశాలకు చెందిన విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. ఈ సందర్భంగా సౌత్ ఇండియా మార్కెటింగ్ ప్రతినిధి వెంకట వినయ్ చౌదరి, ఆంధ్రా, తెలంగాణ ఇన్‌చార్జి ఎస్. మహేంద్రనాయుడులతో కలిసి యూనివర్సిటీలోని కోర్సుల బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

బొండా కుటుంబసభ్యుల ఓట్లు రద్దు చేయాలి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, లీగల్ సెల్ నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కూటమి సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి బొండా ఉమా, అతని కుటుంబ సభ్యుల ఓట్లు అజిత్‌సింగ్‌నగర్ అమెరికన్ హాస్పిటల్ రోడ్డులో ఉన్న కమర్షియల్ బిల్డింగ్ అయిన టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో ఉన్నాయని వాటిని వెంటనే రద్దు చేయాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్, వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నవరత్నాల వైస్‌చైర్మన్ నారాయణమూర్తి కలిసి లిఖితపూర్వకంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కోరారు. దీనిపై ఎన్నికల అధికారిని సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ బొండా ఉమా, అతని కుటుంబ సభ్యుల ఓట్లు అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయం అడ్రస్‌లో ఉన్నాయని, కుటుంబాలు ఉండని కమర్షియల్ బిల్డింగ్‌లో ఉన్న ఆ ఓట్లను వెంటనే రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, లీగల్ సెల్ రీజనల్ కోఆర్డినేటర్ ఒగ్గు గవాస్కర్ పాల్గొన్నారు.

32వ డివిజన్‌లో వెలంపల్లి సతీమణి ప్రచారం



అయోధ్యనగర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి సతీమణి శ్రీవాణి

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో సోమవారం వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు సతీమణి శ్రీవాణి, కుటుంబ సభ్యులు నగరపాలకసంస్థ కోఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణితో కలిసి వెలంపల్లి విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గడప గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. మంచి మనసున్న వ్యక్తి వెలంపల్లి శ్రీనివాసరావు అని పేర్కొన్నారు. అహర్నిశలు అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌ఛార్జి గుండే సుందర్‌పాల్, ఒగ్గు గవాస్కర్, కొండపల్లి బుజ్జి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.